సాక్షి
సంగారెడ్డి
శనివారం । 9 । మార్చి । 2024



మార్మోగిన కొమురవెల్లి
కొమురవెల్లి మల్లన్న దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.
వివరాలు 8లో ▸



సైబర్ మోసం
సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, యువతి మోసపోయారు.
వివరాలు 8లో ▸



మహిళలు కీలకం
దేశాభివృద్ధిలో మహిళలు కీలకమని సీసీఎం బీ సీనియర్ శాస్త్రవేత్త విష్ణుప్రియ అన్నారు.
వివరాలు 9లో ▸




• సకల శుభకరుడు.. భోళా శంకరుడు

జిల్లావ్యాప్తంగా శుక్రవారం శివరాత్రి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు ఉపవాసం ఉండి శివాలయాలను సందర్శించారు. సాయంత్రం ఒక్కపొద్దు విడిచి రాత్రంతా జాగారం ఉన్నారు. శైవక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన కేతకీ సంగమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. అమృతగుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు పూజలు నిర్వహించారు. అలాగే ఆలయాన్ని ప్రముఖులు సందర్శించారు. - ఝరాసంగం(జహీరాబాద్)



కేతకీలో చిన్నారి శివస్వాములు



కేతకీ పార్వతీ పరమేశ్వరులు



ఆలయంలో క్యూ లైన్‌లో భక్తులు



ఏడుపాయల ఆలయం ఎదుట భక్తుల సందడి, ఇన్‌సెట్‌లో వనదుర్గ అమ్మవారు

న్యూస్‌రీల్

నేడు వట్‌పల్లికి మంత్రి

వట్‌పల్లి(అందోల్): వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం వట్‌పల్లి మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారని చెప్పారు. అలాగే వెంకటఖ్వాజా దర్గా ఉత్సవాలలో పాల్గొంటారని వివరించారు.

ఆలయ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మహా శివరాత్రిని పురస్కరించుకొని ఎమ్మెల్యే దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో ఆలయం వరకు బీటీ రోడ్డును పూర్తి చేయిస్తానన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, పోలీస్, రెవెన్యూ క్యాంపులను పరిశీలించారు. శనివారం నిర్వహించే ఎడ్లబండ్ల ఊరేగింపు, జాతరను సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, సంతోష్, రాజు, సంగమేశ్వర్, రాజశేఖర్‌రెడ్డి, రఘుపతి రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాపురాజు, సభ్యులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

మెదక్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని డీవైఎస్ నాగరాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో బాలికలకు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ జట్టు మొదటి బహుమతి సాధించింది. అనంతరం ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వంశీ, కోశాధికారి రూపేందర్, ఎస్‌ఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఘరానా మోసగాడు

తూప్రాన్: చిట్టీలు, అధిక వడ్డీల ఆశచూపి సుమారు రూ.20 నుంచి రూ.30 కోట్లతో పరారైన ఘరానా మోసగాడు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. ఈ విషయం తెలిసి బాధితులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్‌ఐ శివానందం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన బిజిలిపురం యాదగిరి కొన్నేళ్లుగా చిట్టీలు, అధిక వడ్డీలతో లావాదేవీలు కొనసాగిస్తున్నాడు. ఆశతో కొందరు యాదగిరికి రూ.లక్షల్లో డబ్బులు ముట్టజెప్పారు. మొదట్లో ఒప్పందం ప్రకారం అధిక వడ్డీ చెల్లించాడు. విషయం ఆనోట, ఈ నోట అందరికీ తెలియడంతో పెద్దసంఖ్యలో జనాలు డబ్బులు ఇచ్చారు. అలాగే చిట్టీలు వేసిన వారికి సైతం అధిక వడ్డీ ఆశ చూపాడు. ఇలా ఒకరి నుంచి మరొకరికి డబ్బులు ఇచ్చిపుచ్చుకోవడం చేశాడు. చివరికి మొదట ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించాల్సిన వాయిదా రావడంతో ఈనెల 4న భార్య, పిల్లలతో కలిసి పరారయ్యాడు. బాధితులు ఆందోళనకు దిగడంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. పోలీసులు బాధితులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

త్యాగానికి ఫలితం

- సురేష్ షెట్కార్‌కు దక్కిన జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ టికెట్
- అసెంబ్లీ ఎన్నికల్లో 'ఖేడ్' టికెట్ త్యాగం
- కలిసొచ్చిన ఖర్గేతో సన్నిహిత సంబంధాలు
- తొలి జాబితాలో పేరు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌ను త్యాగం చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్‌కు అనుకున్నట్లుగానే ఎంపీ స్థానానికి ఆ పార్టీ అభ్యర్థిత్వం దక్కింది. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ అధినాయకత్వం ఢిల్లీలో ప్రకటించింది. ఈ జాబితాలో తెలంగాణ నుంచి నలుగురిని ప్రకటించగా, అందులో షెట్కార్‌కు చోటు దక్కింది. అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణఖేడ్ కాంగ్రెస్ టికెట్‌ను సురేష్ షెట్కార్‌కు దక్కింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయిన విషయం విదితమే. గెలుపు అవకాశాలు డాక్టర్ సంజీవరెడ్డికే ఎక్కువగా ఉండటంతో రాష్ట్ర అధినాయకత్వం సూచన మేరకు షెట్కార్ తన టికెట్‌ను త్యాగం చేశారు. సంజీవరెడ్డికే అవకాశం ఇచ్చారు. ఈయన గెలుపుకోసం షెట్కార్ వర్గం పనిచేసింది. దీంతో ఇక్కడ కాంగ్రెస్‌కు విజయం దక్కింది.

బహిరంగసభలో ప్రకటించినట్లుగా..

జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సురేష్‌కుమార్ షెట్కార్ పేరును సీఎం రేవంత్‌రెడ్డి ముందుగానే ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణఖేడ్‌లో జరిగిన బహిరంగ సభలో ఈ మేరకు ప్రకటన చేశారు. సీటు త్యాగం చేసిన షెట్కార్‌కు ఎంపీగా అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. అనుకున్నట్లుగానే షెట్కార్‌కు ఈ టికెట్ దక్కింది. ఈ టికెట్‌పై ఎన్‌ఆర్‌ఐ ఉజ్వల్‌రెడ్డి కూడా ఆశలు పెట్టుకున్నారు. జహీరాబాద్‌కు చెందిన ఉజ్వల్‌రెడ్డి కొన్ని నెలలుగా నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. క్రీడా పోటీలు నిర్వహించారు. టికెట్ కోసం తనవంతుగా ప్రయత్నాలు చేశారు. కానీ అనుకున్నట్లుగా షెట్కార్‌కే అభ్యర్థిత్వం దక్కింది.

కలిసొచ్చిన ఖర్గేతో సంబంధాలు

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో షెట్కార్‌కు దగ్గరి సంబంధాలున్నాయి. ఈ సన్నిహితం ఎంపీ అభ్యర్థిత్వం దక్కడంలో కలిసొచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో లింగాయత్ సామాజికవర్గం ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. ఈ సామాజిక వర్గానికి కూడా ప్రాతినిథ్యం కల్పించినట్లు అవుతుందని, ఆ కోణంలో ఆలోచించి అధినాయకత్వం షెట్కార్ వైపు మొగ్గు చూపినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

బయోడేటా



పేరు : సురేష్ కుమార్ షెట్కార్
తండ్రి : శివరావ్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్య్ర సమరయోధులు
తల్లి : చంద్రమ్మ షెట్కార్
తాత : అప్పారావు షెట్కార్, మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్య్ర సమరయోధులు.
పుట్టిన తేదీ : 08.08.1960
వయస్సు : 64
భార్య : ఉమాదేవి షెట్కార్
సంతానం : కూతురు డాక్టర్ గిరిజ షెట్కార్, ఏఐసీసీ స్పోక్స్‌పర్సన్, కుమారుడు రాకేష్ షెట్కార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చిన్న కూతురు శివాని షెట్కార్.
విద్యార్హత : బీఎస్సీ (డెయిరీ) - ధార్వాడ్ యూనివర్సిటీ.

రాజకీయ ప్రస్థానం..

- 1992 నుంచి 97 వరకు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు.
- 1997 నుంచి 2004 వరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.
- 1994 లో నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.
- 2004లో ఖేడ్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- 2009లో జహీరాబాద్ ఎంపీగా విజయం.
- 2014లో జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓటమి.
- 2018లో నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు.
- ఎన్జీరంగా విశ్వవిద్యాలయం డైరెక్టర్‌గానూ పనిచేశారు.

ఎంపీగా మూడోసారి పోటీ

జహీరాబాద్: సురేష్ షెట్కార్ మూడో పర్యాయం ఎంపీగా పోటీ చేయనున్నారు. 2009లో కొత్తగా జహీరాబాద్ పార్లమెంట్ ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి సయ్యద్ యూసూఫ్‌అలీపై పోటీచేసి 19,407 ఓట్ల మెజార్టీతో సురేష్ షెట్కార్ గెలుపొందారు. 2014లో సిట్టింగ్ ఎంపీగా ఉన్న సురేష్ రెండో మారు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించింది. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన బీబీపాటిల్ చేతిలో సురేష్ షెట్కార్ 1,44,631 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో మాత్రం ఈయనకు టికెట్ దక్కలేదు. ఇప్పటికే బీజేపీ ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. ఇరువురు కూడా లింగాయత్ సమాజానికి చెందిన వారే.

మహిళా దినోత్సవం రోజునే వెలుగు చూసిన దారుణం

బాలికపై తోటి విద్యార్థుల లైంగిక వేధింపులు

చేగుంట(తూప్రాన్): మహిళా దినోత్సవం రోజునే ఓ బాలిక లైంగిక వేధింపులకు గురైన ఘటన వెలుగుచూసింది. బాలికను ముగ్గురు మైనర్లు వేధించడంతో పోలీసులు విచారిస్తున్నారు. మెదక్ జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చేగుంట మండలానికి చెందిన బాలిక డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఆ బాలికను ముగ్గురు తోటి విద్యార్థులు గత నవంబర్‌లో విహార యాత్ర పేరుతో తీసుకెళ్లారు. అక్కడ బాలికపై లైంగికంగా వేధించారు. అంతేకాక ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. వారిలో ఒకరు జరిగిన ఘటనను సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఇటీవల ఆ బాలుడు తన మిత్రుడితో గడపాలని లేదంటే వీడియోను బయటపెడతానని బాలికను వేధించసాగాడు. భయపడిన బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పింది. వారు పోలీసులను ఆశ్రయించారు. బాలికపట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. ఇదే విషయమై ఎస్‌ఐ బాలరాజును వివరణ కోరగా సున్నితమైన అంశం కావడంతో లోతుగా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

భద్రప్ప జాతరకు సిద్ధం

కల్హేర్(నారాయణఖేడ్): మహాశివరాత్రి నేపథ్యంలో కల్హేర్ శివారులోని భద్రప్ప స్వామి ఆలయ జాతరకు సర్వం సిద్ధం చేశారు. శనివారం నుంచి మూడు రోజులు పాటు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పక్కనే పోలేరమ్మ మందిరం వద్ద బోనాలు ఊరేగింపు జరుపుతారు. ప్రారంభ రోజు ఆలయం చుట్టూ బండ్ల ప్రదర్శన, ఆదివారం రాత్రి రథం ఊరేగింపు, సోమవారం కుస్తీ పోటీలతో ఉత్సవాలు ముగుస్తాయి. అలాగే ఇందిరానగర్ వద్ద వెలిసిన దుర్గమ్మ మందిరం వద్ద జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణకు 10న పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించనున్న గ్రూప్స్ ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కవిత తెలిపారు. స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా వంద మంది అభ్యర్థులకు సీట్లు కేటాయింస్తామన్నారు. ఇందులో ఎస్సీలకు 75%, బీసీలకు 15%, ఎస్టీలకు 10 శాతం, సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం శనగలు, పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు శుక్రవారం పీఏసీఎస్ సీఈఓ రవీందర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అతివలకు ఆసరా

- డ్వాక్రా సంఘాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
- మహిళల ఆర్థికాభివృద్ధికి సెర్ప్ చర్యలు
- కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం
- స్త్రీనిధి, బ్యాంకు లింకేజీలతో రుణాల మంజూరు



గ్రామ సంఘం లీడర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఐకేపీ అధికారులు (ఫైల్)

గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. డ్వాక్రా గ్రూపుల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తూ కొత్త సంఘాల ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. అర్హులను గుర్తించి సభ్యత్వం ఇస్తుంది. సంఘాలకు రుణాలు మంజూరు చేయడంలో రాష్ట్రంలో జిల్లా తొలిస్థానంలో ఉంది.

మునిపల్లి(అందోల్): గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా తోడ్పాటు అందించేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) చర్యలు చేపట్టింది. జిల్లాలో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 18–58 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి మహిళను సంఘంలో సభ్యురాలిగా చేర్చుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తూ మార్గ దర్శకాలు విడుదల చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కొత్త సంఘాల ఏర్పాటుకు డీఆర్‌డీఏ, ఐకేపీ అధికారులు చర్యలు చేపట్టారు.

ఓటరు జాబితా ఆధారంగా...

నూతన సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలో ఇప్పటి వరకు సంఘాలలో లేని వారి వివరాలను సేకరిస్తోంది. ఓటరు జాబితా ఆధారంగా 18 ఏళ్ల నిండి 58 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారి పేర్లను వేరు చేస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం 10 మంది సభ్యుల చొప్పున సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. గ్రామాల్లో సమావేశాలను ఏర్పాటు చేసి సంఘాల బాధ్యత, వాటి ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నారు. 18 సంవత్సరాలు నిండి వివాహితులైన మహిళలే సంఘంలో సభ్యులుగా చేర్చుకుంటారు. ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారుంటే సంఘంలో సభ్యులుగా తీసుకోరు. దారిద్ర్యపు రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యత ఉంటుంది.

జిల్లాలో సంఘాలు 18,834

జిల్లాలో మొత్తం సంఘాలు 18,834 ఉన్నాయి. 14,040 సంఘాలకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 769.60 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 10,569 సంఘాలకు గాను రూ.745.52 కోట్ల రుణాలను మంజూరు చేశారు. ఇంకా 3,471 సంఘాలు రుణాలు పొందాల్సి ఉంది.

ఆర్థికంగా ఎదుగుతున్నారు



మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది. వీటికి బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి నుంచి రుణాలు మంజూరు చేస్తుంది. రుణాలు తీసుకున్న ప్రతి సభ్యురాలు ఏదో ఒక వ్యాపారం చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. సంఘాల అభివృద్ధికి లీడర్లందరూ కృషి చేస్తున్నారు.
- సంగమ్మ (తాటిపల్లి)

రాష్ట్రంలోనే మొదటి స్థానం



డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరులో సంగారెడ్డి జిల్లా గత సంవత్సరం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మహిళలు ఆర్థిక బలోపేతానికి కొత్త సంఘాలు ఏర్పాటు చేస్తున్నాం. సభ్యత్వం పొంది రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.
- జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ

ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తాం



హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- కార్మికుల బాండ్స్‌కు డబ్బులు ఇస్తాం
- 'మహాలక్ష్మి'తో బస్టాండ్లన్నీ కళకళ
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తామని, అలాగే కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్‌లో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించే బస్టాండ్ ఆధునీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపే గతంలో ప్రకటించిన బాండ్స్ పేమెంట్స్ ఇష్యూ చేస్తామన్నారు. చీఫ్ సెక్రటరీ, ఆర్టీసీ ఎండీతో కలిసి చర్చించి ఇతర సమస్యల పరిష్కారానికి జీఓ రూపంలో తీసుకువస్తామన్నారు. ఇంటిలో మహాలక్ష్మి పుడితే ఇల్లు ఎలా కళకళలాడుతుందో ఆర్టీసీకి మహాలక్ష్మి పథకంతో బస్టాండ్‌లన్నీ అక్కాచెల్లెమ్మలతో కళకళలాడుతున్నాయన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో 26 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారన్నారు. ఇందుకు నెలకు రూ.350 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. దీంతో ఆర్టీసీని నిలదొక్కుకుంటోందన్నారు. త్వరలో కొత్త బస్సుల సంఖ్య పెంచడంతోపాటు కొత్తగా బస్టాండ్లను సైతం నిర్మిస్తామన్నారు. ఆర్టీసీకి ఒక్క రూపాయి నష్టం లేకుండా ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రస్తుతం 100 శాతం ఆక్యుపెన్సీ రేటు పెంచుకున్నామని తెలిపారు.

ఆదాయ మార్గాలను ఎత్తుకుపోయారు..

హుస్నాబాద్ డిపో బలహీనంగా ఉన్నప్పుడు సిద్దిపేట, హన్మకొండ, కరీంనగర్ డిపోలు ఇక్కడి ఆదాయ మార్గాలను ఎత్తుకుపోయాయని మంత్రి పొన్నం తెలిపారు. మళ్లీ హుస్నాబాద్ డిపోకు కొత్త బస్సులు తెచ్చి ఆదాయం పెరిగేలా రూట్లను ఏర్పాటు చేస్తామన్నారు.

క్లుప్తంగా

హరీశ్‌రావు వాఖ్యలు సరికాదు
తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం

మెదక్: ఉద్యోగ, ఉపాధ్యాయులను అవమానించే విధంగా రైతు బంధు ఆపి జీతాలు ఇస్తారా అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడిన తీరు సరైంది కాదని తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆయన వ్యాఖ్యల్నిజిల్లా తపస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రైతులను ఉద్యోగులపైకి రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొదటి తారీఖు జీతాలు ఇస్తే మీకున్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.

చాక్‌పీస్‌పై తల్లి చిత్రం



మనోహరాబాద్ (తూప్రాన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనోహరాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు బ్రహ్మచారి చాక్‌పీస్‌పై తల్లీబిడ్డల చిత్రాన్ని చెక్కి అబ్బురపర్చాడు. ఈ చాక్‌పీస్‌లో బిడ్డపై తల్లి చూపించే చిత్రాన్ని చెక్కాడు.

సుఖదుఃఖాలను సమానంగా చూడాలి
ప్రవచనకర్త గరికపాటి



ప్రవచనం చేస్తున్న గరికపాటి

సిద్దిపేటజోన్: సుఖదుఃఖాలను సమానంగా చూసినప్పుడే మనం ఆనందంగా ఉంటామని ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నర్సింహారావు అన్నారు. శుక్రవారం రాత్రి మహాశివరాత్రి సందర్భంగా స్థానిక విశాలాక్షి సమేత విశ్వేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. సుఖం వస్తే సంతోషం, దుఃఖం వస్తే బాధ పడొద్దని సూచించారు. ఆధ్యాత్మికత ఒక్కటే ఈ ప్రపంచాన్ని మార్చుతుందన్నారు. ఆధ్యాత్మికత అనేది ప్రతీ ఒక్కరి జీవితానికి అవసరమని తెలిపారు. దేవుళ్ల సతీమణులు శరీరంలో ఏదో ఒక భాగంగా నిక్షిప్తమై ఉంటారని పేర్కొన్నారు. ఆడ, మగ వేర్వేరు కాదని, ఇద్దరూ ఒక్కటేనని అందుకు అర్ధనారీశ్వరుడు నిదర్శనమని పేర్కొన్నారు. భక్తి, జ్ఞానం, వైరాగ్యం ద్వారానే మనం అనుకున్న లక్ష్యాలను సాధించే అవకాశం ఉందన్నారు.

ముగ్గురు పిల్లలతో సహా..
తల్లి అదృశ్యం



పిల్లలతో కాజల్‌దేవి

సిద్దిపేటఅర్బన్: మండలంలోని నాంచారుపల్లి శివారులో పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్న మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటనపై సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు..బీహార్ రాష్ట్రానికి చెందిన కాజల్‌దేవి (30)భర్తతో కలిసి మూడు నెలల కిందట పనికి వచ్చారు. గురువారం మధ్యాహ్నం తన ముగురు ఆడ పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. అదే పౌల్ట్రీ ఫాంలో పనిచేసే మరో కూలీ మోహిత్ కుమార్‌పై అనుమానం ఉందని కాజల్‌దేవి తండ్రి రామ్‌ప్రీత్ పాశ్వాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

శివోహం..



పాపన్నపేట(మెదక్): ఘనపురం ఆనకట్ట వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



సిద్దిపేటరూరల్: దర్శనం కోసం లైన్‌లో నిల్చున్న భక్తులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు





మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు దేవాలయాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి, దేవతలకు వేద పండితులు హోమాలు, యాగాలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, అధికారులు దేవాలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శుక్రవారం రాత్రి నుంచి నిద్రపోకుండా భక్తి శ్రద్ధలతో శనివారం ఉదయం వరకు ఉపవాస దీక్ష(జాగరణ) చేస్తారు. పలు ప్రముఖ ఆలయాలకు జిల్లా ప్రజలే కాకుండా ఇతర జిల్లాలైన కామారెడ్డి, నిజామాబాద్, రాజన్నసిరిసిల్లా ప్రజలు వచ్చి దర్శించుకుంటున్నారు.



శివ్వంపేట(నర్సాపూర్) : పెద్దగొట్టిముక్కలో శివపార్వతుల కల్యాణోత్సవం



పాపన్నపేట(మెదక్): కలెక్టర్ దంపతుల పూజలు



సంగారెడ్డి టౌన్ : విద్యాపీఠంలో భక్తులకు దర్శనమిచ్చిన భారీ శివలింగం



చేర్యాల(సిద్దిపేట): చిన్న మల్లన్న ఆలయం వద్ద పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి



పెద్దశంకరంపేట(మెదక్): ఎంపీ బీబీ పాటిల్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు) : పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఝరాసంగం(జహీరాబాద్): పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి కుటుంబ సభ్యులు

మార్మోగిన కొమురవెల్లి



స్వామివారి సన్నిధిలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పరమ శివుడి ప్రతి రూపమైన మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారికి నిరంతరంగా మహన్యాస పూర్వక అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి రోజు రాత్రి దేవస్థానం ఆధ్వర్యంలో లింగోద్భావ కాలంలో ఒగ్గు పూజారులు నిర్వహించే పెద్ద పట్నం కార్యక్రమాన్ని చూసేందుకు వేలాది మంది తరలి వచ్చారు. రాజగోపురం నుంచి ప్రధాన రహదారి, గంగరేణు చెట్టు వద్ద సందడి నెలకొంది. కొండ పైన వెలసిన రేణుక ఎల్లమ్మ దేవతకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బిగ్‌బాస్ 7 విజేత పల్లవి ప్రశాంత్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈఓ బాలాజీ, ధర్మకర్తల మండలి చైర్మన్ లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే, మహాశివరాత్రి సందర్భంగా ఒగ్గు పూజారులతో నిర్వహించే పెద్ద పట్నంకు ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి
జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

పాడి పంటలు సమృద్ధిగా పండాలి, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కొమురవెల్లి మల్లికార్జున స్వామిని వేడుకున్నట్లు జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారి దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ వర్గాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజిక వర్గంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి రోజు శివుడిని పూజించడం ఎంతో శుభప్రదమన్నారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

అప్పుల బాధతో ఆత్మహత్య



అనీల్(ఫైల్)



శ్రీనివాస్ (ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండల పరిదిలోని అలియాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్ ఎస్సై హరిశంకర్ గౌడ్ కథనం మేరకు.. కొండాపూర్ మండలంలోని అలియాబాద్‌కు చెందిన హరిజన శ్రీనివాస్ (45) సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ట్రాక్టర్ ఫైనాన్స్‌లో రూ.2 లక్షలు కట్టి, మిగతా డబ్బులు లోన్ తీసుకొని ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఆరు నెలలకు ఒకసారి రూ.90 వేల చొప్పున 3 కిస్తీలు క్రమం తప్పకుండా చెల్లించాడు. తర్వాత శ్రీనివాస్ అనారోగ్యానికి గురై ఆస్పత్రికి రూ .3 లక్షలు ఖర్చు అయ్యాయి. ఈ క్రమంలో వాయిదా డబ్బులు సకాలంలో కట్టలేకపోవడంతో ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన అతడు శుక్రవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని తన పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో..

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తపల్లి అనీల్(31) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. అది సరిగా నడవకపోవడంతో ఆటోను అమ్ముకొని కూలి పనికి వెళ్తున్నాడు. దీనికి తోడు భార్య కవిత ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండేవాడు. భార్య కవితను తల్లివారి గ్రామానికి పంపించి గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం



కూతురితో శ్యామల

నిజాంపేట(మెదక్): వివాహిత అదృశ్యమైన ఘటన నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో చోటు చేసకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన గోదూరి బాలరాజు, గోదూరి శ్యామలకి 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుర్లు సాత్విక, రిషిక ఉన్నారు. కొన్ని నెలల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 5వ తేదీన భర్త ఇంట్లో లేని సమయంలో తన చిన్న కూతురు రిషికను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం రాత్రి గోదూరి శ్యామల తల్లి బాయికాడి సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

మహా అద్భుతం.. శివానందలహరి

గజ్వేల్‌రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ, సాహితీ మిత్రబృందం ఆధ్వర్యంలో శివానంద లహరి వంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని మహతీ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన శివానందలహరి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతోపాటు సంగీత, గాన సమ్మేళన కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ఘటనా స్థలంలో అశోక్, శ్రీనివాస్ మృతదేహాలు

సంగారెడ్డి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన చౌటకుర్ మండల పరిధిలోని శివ్వంపేట గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండలం ముప్పారం తండాకు చెందిన నెనావత్ అశోక్ (28), అతడి బంధువు టేక్మాల్ మండలం మల్కాపూర్ తండా గ్రామానికి చెందిన లకావత్ శ్రీనివాస్ (35) రోజు వారిగా లేబర్ పనికి బైక్‌పై సంగారెడ్డికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అంకోల్–నాందేడ్ జాతీయ రహదారి 161 పై గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

టేక్మాల్(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెకెందిన లకావత్ శ్రీను (33) పని నిమిత్తం బైక్‌పై సంగారెడ్డి వెళ్తున్నాడు. పుల్‌కల్ మండలంలోని శివ్వపేట 161హైవేపై లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. శివరాత్రి పర్వదినాన మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

సాకి చెరువులో మృతదేహం

పటాన్‌చెరు టౌన్: సాకి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ అశోక్ వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిపై తేలి ఉండడంతో స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం తెలుసుకున్నారు. పోలీసులు మృతుడి కోసం స్థానికంగా ఆరా తీయగా మృతుడు నాగపూర్ మెంటల్ హాస్పిటల్ నుంచి పారిపోయి, వచ్చాడని అతడి పేరు నజీర్ అని చెప్పేవాడని స్థానిక దర్గా నిర్వాహకులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి ముస్లిం అని అతడి వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, పోలీసులు తెలిపారు.

ఆధార్ కార్డు ఇల్లీగల్ అకౌంట్లకు..

లింక్ ఉందని రూ.1.48 లక్షలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ వ్యక్తి రూ.7 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని పీజేఆర్ ఎంక్లేవ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జనవరి 1వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. కాగా అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఓ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. ఆ ఉద్యోగి నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేశాడు. పెట్టిన నగదుతోపాటు, లాభాలు చూపిస్తూ వచ్చారు. బాధితుడు పలు దఫాలుగా రూ.7 లక్షల ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వమని అడుగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.48 లక్షలు పోగొట్టుకున్న యువతి..

ఆధార్ కార్డు ఇల్లీగల్ అకౌంట్లకు లింక్ ఉందని చెప్పి బెదిరించి ఓ యువతి వద్ద నుంచి రూ. 1.48 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ యువతికి ఫిబ్రవరి 14వ తేదీన ఫోన్ కాల్ వచ్చింది. మేము ముంబై పోలీసులమని, మీ ఆధార్ కార్డు ఇల్లీగల్ బ్యాంక్ అకౌంట్లకు లింక్ ఉందని చెప్పారు. నీపై కేసు నమోదై ఉందని బెదిరించి ఆ యువతి వద్ద నుంచి డబ్బులు కాజేశారు. దీంతో బాధితురాలు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.